జీపీలోనే పల్లె దవాఖానా

● అరకొర సౌకర్యాల మధ్య వైద్యసేవలు
● ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది

మరిపెడ రూరల్ : మండలంలోని ఎడ్జెర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఓ గదిలో పల్లె దవాఖానా కొనసాగుతోంది. సరైన వసతులు లేకపోవడంతో రోగులు, వైద్యసిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన నూకల రంగారెడ్డి జ్ఞాపకార్థకంగా 1970లో ఇచ్చిన స్థలంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, స్లాబు పెచ్చులూడటంతో పాటు భవనంలోకి మోకాళ్ల లోతు వరకు వర్షం నీరు చేరుతోంది. 2023లో పీహెచ్‌సీ పల్లె దవాఖానగా అప్‌గ్రేడ్ చేసి నూతన భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు నిధులను మంజూరు చేశారు. తాత్కాలికంగా వైద్యసేవలను శిథిల భవనంలో నుంచి జీపీ కార్యాలయానికి మార్చారు. స్థానికుల అభ్యర్థన మేరకు గ్రామానికి చెందిన మరో దాత నూకల శ్రీధర్‌రెడ్డి పల్లె దవాఖానకు స్థలం దానం చేశారు. ఈ స్థలంలో డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ 2023, డిసెంబర్‌లో పల్లె దవాఖాన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి టెండర్ కాకపోవడంతో భవన నిర్మాణం మరింత ఆలస్యమవుతుంది. ఈ నేపథ్యంలో జీపీ కార్యాలయంలోని ఓ మూలన ఉన్న గదిలో అరకొర సదుపాయాల మధ్య రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. సంబంధిత అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేయకపోవడం మూలంగానే ఆలస్యమవుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి పల్లె దవాఖాన భవన నిర్మాణంపై దృష్టిసారించాలని ఎడ్జెర్ల గ్రామస్తులు కోరుతున్నారు.



జీపీ కార్యాలయంలోని పల్లెదవాఖానా

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

డోర్నకల్ : మండలంలోని కస్నాతండా గ్రామపంచాయతీ పరిధిలోని బోరింగ్‌తండాలో గురువారం అగ్నిప్రమాదాల నివారణపై డోర్నకల్ ఫైర్ స్టేషన్ సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్యాస్ సిలిండర్ల ద్వారా సంభవించే ప్రమాదాల నివారణపై వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది వి.మహేష్, బి.సతీష్, టి.సాయి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

యూజీసీ మార్గదర్శకాలు వెనక్కి తీసుకోవాలి

● ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కో కన్వీనర్ సూర్యప్రకాశ్

మహబూబాబాద్ అర్బన్ : యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ మార్గదర్శకాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కోకన్వీనర్ గుగులోత్ సూర్యప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ సెంటర్‌లో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడారు. నూతన విద్య విధానంతో బలహీన వర్గాల విద్యార్థులకు అన్యాయం చేయడమేకాకుండా కొత్తగా యూనివర్సిటీలలో మరో కుట్రకు తెరలేపిన కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని, ప్రభుత్వంపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. భూక్య రాజేష్, గోపిచంద్, వరుణ్, నాయకులు సందేశ్,వంశీ, ధనుష్, ప్రవీణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

భారీ పేలుడు శబ్దం

● భయంతో వణికిపోయిన జనం
● నాలుగు గ్రామాల ఇళ్లల్లో కదిలిన వస్తువులు

కురవి : మండల కేంద్రంలో గురువారం రాత్రి భారీ పేలుడు శబ్దం కలకలం సృష్టించింది. పేలుడు శబ్దం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నాలుగు గ్రామాలకు వినిపించింది. పేలుడు ధాటికి కురవితోపాటు తిర్మలాపురం, నల్లెల్ల, మోద్గులగూడెం గ్రామాలు, తండాల ఇళ్లల్లోని వస్తువులు కిందపడిపోయాయి. కురవి శివారులో ఒక క్రషర్ మిల్లును నిర్వహిస్తున్నారు. మిల్లుకు కూత వేటు దూరంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఉంది. పేలుడు శబ్దం పోలీస్ స్టేషన్‌లో ఉన్న పోలీసులకు సైతం వినపడిందని వారు తెలిపారు. తిర్మలాపురంలో రోజు పేలుడు శబ్దాలు వింటున్నామని ఆ గ్రామానికి చెందిన కల్లెపు శ్రీనివాస్ తెలిపాడు. భారీ పేలుడు శబ్దానికి ఇంట్లోని వస్తువులన్నీ కిందపడిపోయినట్లు వివరించారు. ఇదే విషయమై కురవి ఎస్సై గంద్రతి సతీష్‌ను అడగగా పేలుడు శబ్దం స్టేషన్‌లో వినిపించిందని, ఎక్కడి నుంచి వచ్చిందో విచారణ చేస్తానని తెలిపారు. పేలుడు శబ్దం ఎక్కడిది? ఎందుకు పేల్చారు? అనే విషయాన్ని పోలీసులు విచారణ చేయాల్సిన అవసరం ఉంది.

11నుంచి రాష్ట్రస్థాయి మోడ్రన్ కబడ్డీ పోటీలు

కేసముద్రం : కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి, సోదరుడు పురుషోత్తంరెడ్డిల జ్ఞాపకార్థం ఈనెల 11వ తేదీ నుంచి 13 వరకు రాష్ట్ర స్థాయి మోడ్రన్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి తెలిపారు. గురువారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సహకారంతో ఈ క్రీడలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మండలంలోని కల్వలకు చెందిన గణపారపు హైమాకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.20వేల చెక్కును సంజీవరెడ్డి గురువారం అందజేశారు. కాగా ఇదే గ్రామానికి చెందిన కట్ట వెంకన్న అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సంజీవరెడ్డి పరామర్శించి, ఓదార్చారు.

గీతకార్మికుడికి గాయాలు

కేసముద్రం : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడడంతో గీతకార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని ఉప్పరపల్లిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బత్తిని విజేందర్ తాటిచెట్టు ఎక్కుతుండగా కాలు జారడంతో కిందపడ్డాడు. దీంతో అతడికి నడుముభాగంలో గాయాలు కావడంతో మహబూబాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

రైల్లో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కేసముద్రం : రైల్లో నుంచి పడిన ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తాళ్లపూసపల్లి–కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్ వైపు అప్‌లైన్‌లో వెళ్తున్న రైల్లో ప్రయాణిస్తున్న గుర్తుతెలియని ఓ వ్యక్తి, తాళ్లపూసపల్లి–కేసముద్రం రైల్వేస్టేషన్‌ల మధ్య పడ్డాడు. దీంతో అతని కాళ్లు, చేతులు తెగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని, బ్లాక్ కలర్ జీన్స్ పాయింట్, స్వెటర్, వైట్ టీషర్ట్ ధరించి ఉన్నాడని, 5.5 ఎత్తు ఉన్నట్లు గుర్తించారు. అతడి వద్ద టికెట్ ఉందని, కాని ఎలాంటి ఆధారాలు, గుర్తింపు పత్రాలు లేవని రైల్వేహెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. దీంతో మృతదేహన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు.

చలి తీవ్రతతో యాచకుడి..

బూర్గంపాడు : చలి తీవ్రతతో ఓ యాచకుడు మృతిచెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం అంజనాపురానికి చెందిన గుగులోత్ బాలు(65) ఎనిమిదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోగా కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆయన సారపాక చేరుకుని భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఆశ్రయం కోసం బుధవారం రాత్రి బస్టాండ్‌కు చేరుకున్న బాలు చలికి తట్టుకోలేక మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుడి ఫొటోను పోలీసులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా కుటుంబసభ్యులు సారపాక చేరుకుని మృతదేహం బాలుదేనని నిర్ధారించుకున్నారు. ఆయన కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాల్వలో పడిన కారు.. తప్పిన ప్రమాదం



మరిపెడ : మరిపెడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాల్వలో పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. హైదరాబాద్ వెళ్తున్న యువకులు మరిపెడ శివాలయం దాటిన తర్వాత దేశ్యతండా సమీపంలో గురువారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి ఎస్సారెస్పీ కాల్వలో పడిపోయింది. దీంతో యువకులు బయటపడ్డారు.అనంతరం కారును క్రేన్‌తో బయటికి తీశారు.

నల్లబెల్లం స్వాధీనం

డోర్నకల్ : సీరోలు మండలం మోదుగు గడ్డతండా సమీపంలో గురువారం డోర్నకల్ పోలీసులు నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. అందనాలపాడు, మోదుగు గడ్డతండా మార్గంలో గురువారం పోలీసుల తనిఖీలు చేస్తుండగా మూడు ద్విచక్ర వాహనాలపై అక్రమంగా నల్లబెల్లాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. అక్రమంగా బెల్లం రవాణా చేస్తున్న మోదుగు గడ్డతండాకు చెందిన బానోత్ నరేందర్, సపావట్ రాజు, బాలినధర్మారానికి చెందిన బాదావత్ గణేష్, బాదావత్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. బెల్లం వ్యాపారులైన అందనాలపాడు శివారు సాదుతండాకు చెందిన బానోత్ ఉపేందర్, వాంకుడోత్ సుశీ పరారీలో ఉన్నారని తెలిపారు.

రైతులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి

కురవి : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం గునిగంటి రాజన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌలుదారులకు సాగు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. సాదాబైనామాలను ఆమోదించాలన్నారు. శెట్టి వెంకన్న, నల్లపు సుధాకర్, బొబ్బ వెంకటరెడ్డి, నబూరు మధు, పాపారావు, బుజ్జి, వెంకట్‌రెడ్డి, ప్లయ్య, జలంధర్, మల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంతో పాటుగా శివారు కాలనీలు, తండాల్లో దొంగతనాల నివారణకు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ వినూత్నంగా ఫ్లెక్సీ పోస్టర్ ముద్రించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా దొంగతనాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయడానికి గాను గురువారం ఆటోకు మైకు, ఫ్లెక్సీ పోస్టర్ ఏర్పాటు చేసి జాగ్రత్తలపై వివరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మహబూబాబాద్ అర్బన్ : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం డీఈఓ రవీందర్‌రెడ్డి ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు, గోపికృష్ణ, నాయకులు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

యూటీఎఫ్..



పెద్దవంగర : మండల కేంద్రంలోని విద్యావనరుల భవనంలో టీఎస్ యూటీఎఫ్ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎర్ర వెంకన్న, చంద్రగిరి ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో ఎంఈఓ బుధారపు శ్రీనివాస్ నూతన సంవత్సర క్యాలెండర్ గురువారం ఆవిష్కరించారు.

టీపీటీఎఫ్..



డోర్నకల్ : మండలంలోని ముల్కలపల్లి జెడ్పీఎస్ఎస్‌లో గురువారం టీపీటీఎఫ్–2025 క్యాలెండర్‌ను ఎంఈఓ ఆంగోత్ లక్ష్మా, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సాయిబాబు, ప్రధాన కార్యదర్శి మాలోత్ పులరాజు, స్వామి, కిషన్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



గూడూరు : విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి జె.రవికుమార్ అన్నారు. ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో గురువారం పీఆర్‌టీయూ నూతన క్యాలండర్‌లను ఎంఈఓ ఆవిష్కరించారు. హెచ్‌ఎంలు సుజాత, మంగీలాల్, సునీత, సంఘం ప్రతినిధులు లక్ష్మీపతి, నమ్మల్వార్, రవిచంద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



దంతాలపల్లి : పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పాఠశాల పూర్వ విద్యార్థి, వైద్యుడు శ్రవణ్ అన్నారు. మండలంలోని పెద్ద ముప్పారం కలాన్ పాఠశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రూ.10వేల విలువ గల స్టడీ మెటీరియల్స్ అందజేశాడు. ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, శ్రవణ్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ రామదాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

● సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



నెహ్రూసెంటర్ : సీపీఐ వందేళ్ల పోరాట చరిత్రను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించే సీపీఐ శత వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని గురువారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లా కేంద్రంలో వేలాది మందితో వార్షికోత్సవ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సభకు రాష్ట్ర, జిల్లా నేతలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారని, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వరిపెల్లి వెంకన్న, వీరవెల్లి రవి, వెలుగు శ్రావన్, మేక వీరన్న, అశోక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన నాయకులు



ఎస్పీని సత్కరిస్తున్న టీయూడబ్ల్యూజే నాయకులు

మహబూబాబాద్ రూరల్ : జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను టీయూడబ్ల్యూజే (హెచ్–143) అర్బన్ కమిటీ నూతన కార్యవర్గం గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ నేతలకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ అధ్యక్షుడు హనుమాండ్ల రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, ఉపాధ్యక్షులు ఇరుకుల్ల కిరణ్ కుమార్, రాసూరి లక్ష్మణ్, గంధసిరి వెంకన్న, అమ్మటి వెంకన్న, సహాయ కార్యదర్శులు తోకల రామచంద్రయ్య, బండి రాజ్ కుమార్, గుంటి శ్రీధర్, సభ్యులు యాకూబ్ పాషా, ఆకుల నవీన్, సీతారాం నాయక్, సీనియర్ జర్నలిస్టులు పల్లె శ్రీనివాస్, గౌస్ పాషా, పురుషోత్తం పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

బయ్యారం : టీయూడబ్ల్యూజే (హెచ్–143) మండల నూతన కమిటీని గురువారం బయ్యారంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొంపెల్లి అమర్‌నాథ్, ప్రధానకార్యదర్శిగా బయ్య మహేష్, ఉపాధ్యక్షులుగా సింగారపు రమేష్, కొమిరె జనార్దన్, పల్లె పొంగు ఉపేందర్, సహాయ కార్యదర్శులుగా తునికిపాటి క్రాంతి, రాంబాబు, కోశాధికారిగా శెట్టి ధామస్ తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

శబరిమలకు తరలిన మాలధారులు



మహబూబాబాద్ రూరల్ : అయ్యప్ప దీక్ష స్వీకరించిన 120 మంది మాలధారులు గురువారం శబరిమలకు తరలివెళ్లారు. పట్టణంలోని శ్రీధర్మశాస్త అయ్యప్ప స్వామివారి దేవాలయంలో గురుస్వాములు గుడిబోయిన రామచంద్రయ్య, చల్లగుండ్ల గణేష్ ఆధ్వర్యంలో ఇరుముడి ధారణ నిర్వహించారు.

బెనిఫిట్స్ అందించాలి

డోర్నకల్ : ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అందించాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ అజీజ్ కోరారు. గురువారం డోర్నకల్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

దంతాలపల్లి : పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతోందని విమర్శించారు. పోలెపాక వెంకన్న, సోమారపు రామచంద్రు, రాజశేఖర్, వెంకన్న, సైదులు, జనార్దన్, యాకసాయిలు, కోటి, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర చట్టం తేవాలి

మహబూబాబాద్ అర్బన్ : రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు.

సమస్యలు పట్టించుకోని అధికారులు

నెల్లికుదురు : సబ్ స్టేషన్ పరిధిలోని రైతుల సమస్యలను పరిష్కరించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని ఎంఎంసీ డైరెక్టర్ భాస్కర్ నాయక్ ఆరోపించారు. మండలంలోని రత్తిరాం తండా రైతుతో కలసి స్థానిక సబ్‌స్టేషన్‌లోని ఏఈ చాంబర్‌లోని ఖాళీ కుర్చీకి వినతి పత్రం అందజేశారు.

బియ్యం అందజేత

మహబూబాబాద్ అర్బన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాప్రమాణాల అభివృద్ధికి మధ్యాహ్న భోజనం అందించడానికి ముందుటామని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో గురువారం మధ్యాహ్న భోజనానికి రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. రవీందర్‌గుప్త, సాంబయ్య,

నేడు ముక్కోటి ఏకాదశి

మహబూబాబాద్ రూరల్ : మహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదిన వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా భక్తులు జరుపుకోనున్నారు. ముక్కోటి ఏకాదశికి ఉన్న ప్రాముఖ్యత ఆధారంగా జిల్లాలోని ఆలయాల్లో అర్చకులు ఉత్తర ద్వార దర్శనాలను ఏర్పాటు చేసి భక్తులకు శ్రీమన్నారాయణుడి దర్శనాలు కల్పించేందుకు పనులు ప్రారంభించారు. మానుకోట జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, శ్రీవేణుగోపాలస్వామి,స్వయంభూ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీఉమాచంద్రమౌళీశ్వరస్వామి , శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, అనంతాద్రి శ్రీజగన్నాథ వేకటేశ్వరస్వామి దేవాలయాల్లో ఏకాదశి పూజలు జరగనున్నాయి.

నేడు ఉత్తర ద్వార దర్శనం

గూడూరు : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి, సనాతన శివాలయం, శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.

చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలి

● కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

నెహ్రూసెంటర్ : చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దళిత వాడల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.దళిత నిరుద్యోగులకు అంబేద్కర్ అభయహస్తం అందజేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, చీపిరి యాకయ్య, మందుల మహేందర్, పులిపాక నాగరాజు, మాజీ సర్పంచ్ గద్దపాటి సంతోష్, చేపూరి గణేష్, మచ్చ వెంకన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

ఎస్టీ యూనియన్ ఏర్పాటుచేయాలి

● ఆల్‌ఇండియా గ్యార్‌భాయి మత్రో అధ్యక్షుడు జర్పుల లచ్చిరాం నాయక్

గార్ల : రైల్వేశాఖలో ఎస్టీ ఉద్యోగులకు ప్రత్యేక యూనియన్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం ఆల్ ఇండియా గ్యార్‌భాయి మత్రో అధ్యక్షుడు జర్పుల లచ్చిరాం నాయక్ ఢిల్లీలో ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను, ఎంపీ బలరాంనాయక్‌ను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వేశాఖలో ప్రస్తుతం ఉన్న ఎస్సీ,ఎస్టీ యూనియన్ నుంచి ప్రత్యేకంగా ఎస్టీ యూనియన్ ఏర్పాటు చేయాలని ఆయన ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం రైల్వేశాఖలో ఉన్న ఎస్సీ,ఎస్టీ యూనియన్‌లో ఎస్సీ ఉద్యోగులు ఎక్కువగా లబ్ధి పొందుతున్నారని, ఎస్టీ ఉద్యోగులు వెనకబడి పోతున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం ఎస్టీ ఉద్యోగులకు ప్రత్యేక యూనియన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.డి.నటరాజ్, సుబ్బరాయుడు, వెంకట్రామయ్య, రామ్‌కుమార్, మత్తయ్య ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న లచ్చిరాంనాయక్

హమాలీలుగా బిహార్ కూలీలు..

మరిపెడ రూరల్ : తండధర్మారం ఐకేపీ కొనుగోలు కేంద్రంలో బిహార్ రాష్ట్రానికి చెందిన సుమారు 23 మందికూలీలు రెండు నెలలుగా హమాలీ పని చేస్తున్నారు. ధాన్యం తూకం పెట్టి, బస్తాలు కుట్టడం అన్ని పనులు వారే చేస్తూ ధాన్యాన్ని లోడు చేసి మిల్లుకు పంపిస్తున్నారు. కూలీ పనులు చేయడంలో బిహారీలు దిట్టా. వారి సహకారంతోనే 50 లారీలు ధాన్యం లోడులను తరలించి మండలంలోని మొదటి స్థానంలో ఉన్నట్లు శిరిడిసాయి బాబా కొనుగోలు నిర్వాహకులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

మరిపెడ మండలంలోని తండధర్మారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మరిపెడ తహసీల్దార్ సైదులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిరిడి సాయిబాబా కొనుగోలు కేంద్రంలో 13,225 క్వింటాళ్ల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుగులోతు బుజ్జి, విజయ, ట్యాబ్ ఆపరేటర్ చిన్న తదితరులు పాల్గొన్నారు.



బస్తాలు తూకం వేస్తున్న బిహార్ కూలీలు

సంక్షిప్త సమాచారం

ఉపేందర్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాజేందర్, లక్ష్మణ్, అశోక్ పాల్గొన్నారు.

సీపీఎం ధర్నా

గార్ల : ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గార్లలో భారీ ప్రదర్శన, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్, ఎంపీడీఓలకు అందజేశారు.

విప్లవ వీరవనిత ఫాతిమాబేగం

నెహ్రూసెంటర్ /మహబూబాబాద్ అర్బన్ : సాంఘిక విప్లవ వీరవనిత, తొలి మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమాబేగం అని ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి అన్నారు. ఫాతిమాబేగం జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి గురువారం నివాళులర్పించారు. అలాగే జిల్లా కేంద్రంలోని మా అసోసియేషన్, ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతిని నిర్వహించారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

మహబూబాబాద్ అర్బన్ : మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్రీయ బాలస్వాస్థ్య పరీక్షలు నిర్వహించారని హెచ్‌ఎం సోమగోవర్ధన్ గురువారం తెలిపారు. మొత్తం 92 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడుతున్న వారికి సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు.



విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

గార్ల : విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని హెల్ప్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.కరుణాకర్ సూచించారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో ఆయన విద్యార్థులకు పరీక్షల ప్రిపరేషన్‌పై అవగాహన కల్పించారు.

వర్గీకరణే లక్ష్యంగా..

నెహ్రూసెంటర్ : ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల సమావేశం ఈ నెల 17వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ళ పీరయ్య మాదిగ తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో పీరయ్యమాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు.

దళితులకు రూ.12లక్షల సాయం ఇవ్వాలి

కేసముద్రం : దళితులకు బీఆర్ అంబేడ్కర్ అభయ హస్తం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.12లక్షలు ఇవ్వాలంటూ కేవీపీఎస్ మండల కన్వీనర్ సోమారపు ఎల్లయ్య తహసీల్దార్ దామోదర్‌కు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు.

ఆర్థికసాయం



కురవి : బలపాలకు చెందిన గోల్కొండ హేమలత, ఆమె భర్త మృతిచెందగా వారి పిల్లలు అనాథలుగా మారారు. సుమలత, నాగమణిలకు గ్రామానికి చెందిన నెల్లూరి శ్రీనివాస్ గురువారం రూ.10వేల ఆర్థికసాయం అందజేసి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. చిన్నారులకు దుస్తులు అందజేశారు.

నైపుణ్యం లేకుండా డ్రైవింగ్ సరికాదు

నెల్లికుదురు : నైపుణ్యం, అనుభవం లేని కార్మికులతో ట్రాక్టర్లు నడిపించడం, విద్యుత్ పనులు చేయించడం సరికాదని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం ఎల్లయ్య గురువారం ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పోటీలు

నెల్లికుదురు: మండలంలోని జెడ్పీఎస్ఎస్‌లో కాకతీయ ఫ్రెండ్స్ అసోసియేషన్ వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఎంఈఓ రాందాస్, ప్రతినిధులు ఉపేందర్, లింగమూర్తి, గంగాధర్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

కేసముద్రం: పీక్లాతండా జీపీ బోడగుట్టతండా ప్రాథమిక పాఠశాలలో గురువారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం వెంకట్రామనర్సయ్య, ఉపాధ్యాయులు, కార్యదర్శి పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

గూడూరు : చైనా మాంజా విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ బాబూరావు అన్నారు. మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో గురువారం రాత్రి తనిఖీలు చేసి పతంగి దారాలను పరిశీలించారు.

ప్రైవేట్ పాఠశాలలు సెలవులు పాటించాలి

మహబూబాబాద్ అర్బన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 11 నుంచి 17 వరకు సెలవులను ప్రైవేట్ పాఠశాలలు పాటించాలని జిల్లా ప్రైవేట్ పాఠశాలల టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గండు మురళి కోరారు. గురువారం డీఈఓకు సభ్యులు వినతి పత్రం అందజేశారు.

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్ : రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి రమేశ్ హాజరై మాట్లాడారు.